## విజయవాడ నగర పోలీస్ కమీషనర్ కార్యాలయము

**పత్రికా ప్రకటన** **తేది.20-01-2017.**

# ఆటోడ్రైవర్ నిజాయితీకి పోలీస్ కమీషనర్ గారి ప్రశంస

ప్రయాణీకులు తన ఆటోలో మర్చిపోయిన సొత్తుకు ఆశపడకుండా, తిరిగి ఆ సొత్తును పోగొట్టుకున్న వ్యక్తులకు అందించి తన నిజాయితీ చాటుకున్న ఆటో డ్రైవర్ శ్రీ వై. ఉదయ్‌కుమార్‌ను ది. 20.01.2017న విజయవాడ నగర పోలీస్ కమీషనర్ శ్రీ డి.గౌతం సవాంగ్ ఐపిఎస్ గారు అభినందించి, రివార్డును అందించి ప్రోత్సహించారు.

నున్న రాజీవ్‌నగర్‌కు చెందిన వై.ఉదయ్‌కుమార్ గత కొంత కాలంగా ఆటో డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. ది.15.01.2017న హైదరాబాద్‌కు చెందిన తేజస్విని నాయుడు మరియు ప్రయాంక అనే భార్యభర్తలు పటమటలంక వద్ద తన ఆటో (ఆటో నెం. ఏపి16టిహెచ్ 7907)ను కిరాయికి మాట్లాడుకుని బెంజ్‌సర్కిల్ వద్ద దిగిపోయారు. అయితే వారు వెంటతెచ్చుకున్న లగేజీ బ్యాగ్‌ను ఆటోలోనే మర్చిపోయి హడావుడిగా దిగిపోవడం జరిగింది. లగేజీ బ్యాగ్‌లో రూ.4 వేల నగదు మరియు 12 సవర్ల బంగారు ఆభరణాలు ఉన్నాయి.

ఈ నేపథ్యంలో కొంత సమయానికి బ్యాగ్ ఆటోలో మర్చిపోయిన విషయం గుర్తుకు వచ్చిన భార్యభర్తలు పోలీస్ కంట్రోల్ రూమ్‌కు డయల్ 100 ద్వారా సమాచారం అందించగా, వెంటనే కంట్రోల్ రూమ్ సిబ్బంది సంబంధిత పోలీసులను అప్రమత్తం చేయడంతో పాటు సీసీ కెమేరాల నిఘా ద్వారా ఆటోను గుర్తించడం జరిగింది. ఈలోపే ఆటో నేరుగా పోలీస్ కంట్రోల్ రూమ్‌కు (డయల్ 100) చేరింది. తన ఆటోలో ప్రయాణీకులు మర్చిపోయిన బ్యాగ్‌ను గమనించిన ఆటో డ్రైవర్ ఉదయ్‌కుమార్ పోలీస్ కంట్రోల్ రూమ్‌కు చేరుకుని, బ్యాగ్‌ను పోలీసు అధికారులకు అప్పగించగా ఆ బ్యాగ్‌ను భార్యభర్తలకు అందజేశారు.

నిరుపేద కుటుంబానికి చెందిన ఉదయ్‌కుమార్ 8వ తరగతి వరకు చదువుకున్న కుటుంబ ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా చదువును కొనసాగించలేక గత 3 సంవత్సరాలుగా ఆటో డ్రైవర్‌గా జీవనం సాగిస్తూ, తన తల్లిదండ్రులను మరియు ఇద్దరు అక్క చెల్లెలకి ఆసరాగా ఉన్నాడు.

కష్టపడకుండా సంపాదించిన సొమ్ము అక్కరకు రాదని గ్రహించి, తన ఆటోలో లభించిన బ్యాగ్‌ను నిస్వార్థంగా అప్పగించి తన నిజాయితిని చాటుకున్నాడు. సమాజంలో ఉదయ్ కుమార్ లాంటి నిజాయితీ పరులు ఎంతోమంది ఉన్నారు. వీరందరు సమాజానికి ఎన్నో సందర్భాలలో తమ నిజాయితీని చాటుకుని ఎంతో మందికి ఆదర్శంగా నిలుస్తున్నారు. విలువైన వస్తువులను నిజాయితీగా వాటి సొంతవార్లకు అప్పగించిన ఆటో డ్రైవర్ ఉదయ్‌కుమార్‌ను నగర పోలీస్ కమీషనర్ గారు అభినందించి, రూ.5000/- నగదు బహుమతి ఇచ్చారు.

--xx--